క్లుప్తంగా

నేడు డిండికి ఎమ్మెల్యే రాక

డిండి : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనుల శంకుస్థాపనకు శనివారం ఎమ్మెల్యే బాలునాయక్ రానున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు రాజేశ్‌రెడ్డిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు వారు పిలుపునిచ్చారు.

హజ్ యాత్రికులకు నేడు శిక్షణ తరగతులు

మిర్యాలగూడ : పవిత్ర మక్కా హజ్ యాత్రకు వెళ్లే ముస్లిం సోదరులకు ఈ నెల 2న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మిర్యాలగూడ పట్టణంలోని ఆరాఫత్ మస్జీద్(చిన్న మసీదు)లో తొలి విడత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మిర్యాలగూడ డివిజన్ హజ్ సొసైటీ కార్యదర్శి ఎండీ అర్షద్ ఖాన్, సభ్యులు ఇస్మాయిల్, వాజిద్, అలీంలు తెలిపారు. శిక్షణ తరగతులకు ప్రధాన వక్తగా జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన ప్రముఖ మౌలానా మజాహర్ ఖాస్మీ హాజరవుతున్నట్లు వారు తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు మిర్యాలగూడ డివిజన్ వ్యాప్తంగా యాత్రికులు విధిగా హాజరుకావాలని వారు కోరారు. మౌలానా మజహర్ అమూల్యమైన సందేశాన్ని, సలహాలను తెలియజేస్తారన్నారు.

నేటినుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

నాగార్జునసాగర్ : నందికొండ బీసీ గురుకుల పాఠశాల మైదానంలో శనివారం నుంచి కుందూరు జానారెడ్డి ఛాలెంజ్ ట్రోఫీ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నల్లగొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.భూలోకరావు, జి.కర్తయ్యలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.70వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సీనియర్ పురుషులకు మాత్రమే అవకాశమున్నట్లు పేర్కొన్నారు. 33జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని, పోటీలు లీగ్, నాక్అవుట్ పద్ధతిలో ఉదయం, సాయంత్రం మ్యాట్‌పై విద్యుత్ దీపాల వెలుగులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు 4వ తేదీవరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని నాగార్జున నగర్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహం వెనుభాగంలో అద్దంకి- నార్కట్‌పల్లి బైపాస్ వెంట ఉన్న భూమిని ఆక్రమించుకుంటున్నారంటూ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ యూసుఫ్‌కు బాధితురాలు చేగొండి శ్రీలక్ష్మీదేవి ఫిర్యాదు చేసింది. తను 7గుంటల భూమిని 1995 కొనుగోలు చేసి మున్సిపల్ నిబంధనల మేరకు ఇంటి నిర్మాణం చేశామని, పక్కనే బైపాస్ వెళ్తుండడంతో తన ఇంటి(బాలుర హాస్టల్) వెనుక భాగంలో కొంత ఖాళీ స్థలాన్ని వదిలామని ఆ భూమిని చదును చేస్తూ ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. అదే విధంగా ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లు కూడా ఉన్నాయని తెలిపింది.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వేములపల్లి : ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. వేములపల్లి మండలం బొమ్మకల్‌కు చెందిన చింతకుంట్ల వెంకట్‌రెడ్డి, గార్లపాటి ఉపేందర్‌రెడ్డి, నామిరెడ్డి వెంకట్‌రెడ్డి, గడ్డం మారయ్యలు ట్రాక్టర్ల ద్వారా బొమ్మకల్ గ్రామ శివారులోని పాలేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈమేరకు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి యజమానుల తోపాటు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

దేవరకొండ : దేవరకొండ మండల పరిధిలోని తాటికోలు వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 4 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. శుక్రవారం వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

హాలియా : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో నూతనంగా నిర్మించనున్న గంగమ్మతల్లి గుడి నిర్మాణానికి శుక్రవారం బీజేపీ నాయకులు డాక్టర్ పానుగోతు రవికుమార్, పలుగుతండా మాజీ సర్పంచ్ పానుగోతు సంతోష్ దంపతులు ఆలయ కమిటీకి రూ.10వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో గౌనీ రాజా రమేష్ యాదవ్, బూడిద గోవింద్ తదితరులు ఉన్నారు.

ఎస్ఐకి సన్మానం



ఎస్ఐని సన్మానిస్తున్న సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ రూరల్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సతీశ్‌వర్మను శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో బీజేపీ అంబేద్కర్ యువజన సంఘం, అవంతిపురం యూత్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు చెలిమెండ్ల వెంకటరత్నం, మోటాం సైదులు, మోతే రాంబాబు, కోటి, కోటేష్, రవి, శ్రీను, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



హాలియా : లబ్ధిదారులకు జీరో బిల్లులు అందజేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



అడవిదేవులపల్లి : ఉచిత విద్యుత్ బిల్లును అందజేస్తున్న అధికారులు



మాడుగులపల్లి : లబ్ధిదారురాలికి జీరో విద్యుత్ బిల్లు అందిస్తున్న అధికారులు

హాలియా : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తుందని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అనుముల గ్రామంలోని ఎస్సీ కాలనీలో గృహజ్యోతి పథకాన్ని ఆయన ప్రారంభించి జీరో బిల్లులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే పేదలకు సంక్షేమ పథకాలు దరిచేరుతాయన్నారు. పేదల అవసరాలు తీర్చేందుకు ప్రజాపాలన స్వీకరించామని, ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తామన్నారు. గృహజ్యోతి పథకం కింద 200యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజా రమేష్ యాదవ్, విద్యుత్ ఎస్ఈ టీ.ఆర్ చంద్ర మోహన్, డీఈ వెంకటేశ్వర్లు, ఏడీఈ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు యడవెల్లి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు తక్కెళ్ళపల్లి యల్లమ్మ, పిల్లి చంద్రకళ ఆంజనేయులు, నాయకులు తక్కెళ్ళపల్లి సైదులు ఉన్నారు.

అర్హులందరికీ గృహజ్యోతి పథకం అమలు

మిర్యాలగూడ అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న గృహజ్యోతి పథకాన్ని అర్హులైన వారందరికీ అందిస్తామని ట్రాన్స్‌కో ఏడీఈ కోడిరెక్క రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండువందల యూనిట్ల లోపు వారికి ఉచిత కరెంట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. రేషన్ కార్డు ఉండి గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోలేని వారు ప్రజాపాలన రిసిప్ట్ కోసం మండలాల్లో ఎంపీడీఓ, మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, వారు ప్రజాపాలనలో మాదిగా రిసిప్ట్ ఇస్తారని, ఆ రిసిప్ట్‌ను కరెంట్‌బిల్లు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు తీసుకుని కరెంట్ ఆఫీస్‌లో కాని మీ దగ్గర్లో ఉన్న లైన్‌మెన్ వద్దగాని సంబంధించిన పత్రాలు ఇచ్చి గృహజ్యోతి క పథకం కింద నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయించిన ప్రకారం జీరో బిల్లు 2వందల యూనిట్లు లోపు వాడిన వారందరికీ ఇస్తామని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఏఈ లు వెంకటేశ్వర్లు, అమర్‌సింగ్, వెంకట్‌రెడ్డి, లైన్ ఇన్స్పెక్టర్ మారం శ్రీనివాస్, సోమాచారి తదితరులున్నారు. అలాగే పట్టణంలో షాబునగర్‌లో గృహ జ్యోతి పథకం ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు శుక్రవారం జీరో బిల్లును మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మురళిమోహన్, సైదా, నరేందర్‌రెడ్డి, కిరణ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, శౌరి, శేఖర్‌రెడ్డి, ఇంద్రకుమార్, రవి, రాద, జానికి, భీమా ఉన్నారు.

సబ్సిడీ బిల్లు అందజేత

అడవిదేవులపల్లి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహా జ్యోతి పథకంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో విద్యుత్ లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ బిల్లులను మండల విద్యుత్ ఏఈ లావూడి శ్రీనునాయక్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ లైన్‌మెన్ శ్రీనునాయక్, జూనియర్ లైన్‌మన్ ఘాసీరాం, మీటర్ రీడర్ జగదీష్ స్కీల్ వర్కర్ బండి శివ, నాగేశ్వర్‌రావు, సాయి పాల్గొన్నారు.

మాడుగులపల్లి : ఎన్నికల హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం గృహజ్యోతి పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. శుక్రవారం మండల వ్యాప్తంగా గృహ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్‌శాఖ అధికారులు జీరో బిల్లులు పంపిణీ చేశారు. 200 యూనిట్లలోపు వినియోగించుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వమే బిల్లులు చెల్లిస్తుందని ఏఈ మణిదీప్ తెలిపారు. అర్హులంతా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సబ్ ఇంజినీర్ గీతారెడ్డి, ఫోర్‌మెన్ జ్ఞానప్రకాశ్, లైన్‌మెన్ మురళి, జూనియర్ లైన్‌మెన్ సురేష్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

చందపేటను ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతా



చిత్రియాలలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట : ఆదర్శ మండలంగా చందపేటను తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పొగిళ్ల, కంబాలపల్లి, పాత కంబాలపల్లి, రేకులగడ్డ, చిత్రియాల, పెద్దమూల, గాగిళ్లాపురం, గన్నెర్లపల్లి, మానావత్‌తండాలలో రూ.1.90 కోట్లు విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమన్నారు. పొగిళ్లలో రూ.20లక్షలతో సీసీ రోడ్డు, రేకులవలయంలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు, రూ.13 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం భవనం, పాతకంభాలపల్లిలో రూ.15లక్షలతో, రేకులగడ్డలో రూ.15లక్షలు, చిత్రియాల రూ.40 లక్షలతో సీసీ రోడ్డు, రూ. 28లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, రూ.10 లక్షలతో పాఠశాల ప్రహరి నిర్మాణానికి, గాగిళ్లాపురం రూ.5లక్షలతో సీసీ రోడ్డు, గన్నెర్లపల్లిలో రూ.20లక్షలతో సీసీ రోడ్డు మానావత్‌తండాలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పార్వతిచందునాయక్, జెడ్పీటీసీ బుజ్జిలచ్చీరాం, పీఏసీఎస్ చైర్మన్‌లు జాలా నర్సింహారెడ్డి, కొండా శ్రీశైలంయాదవ్, వెంకటయ్య, బండల తిరుపతయ్య, బస్వారెడ్డి, సురేందర్‌రెడ్డి, వెంకటయ్య, రామకృష్ణారెడ్డి, యాదయ్య, అంజయ్య, హరికృష్ణ, పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాల స్వామి కల్యాణం



స్వామి వారికి తలంబ్రాలు సమర్పిస్తున్న పూజారులు

త్రిపురారం : మండలంలోని బాబు సాయిపేట గ్రామంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ మువ్వా వేణు గోపాల స్వామి వారి కల్యాణాన్ని శుక్రవారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా నిర్వహించారు. యజ్ఞకులు కారంపుడి వంశీకృష్ణమాచార్యులు ఆలయ పూజారి కనగాల రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో ముందుగా స్వామి వారు అమ్మవార్లకు ఎదుర్కొళ్ల కార్యక్రమం నిర్వహించి అనంతరం కల్యాణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిపురారం, చిల్లాపురం, పెద్ద దేవులపల్లి, తుంగపాడు, నర్లకంటి గూడెం, ముకుందాపురం గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కల్యాణాన్ని తిలకించి తలంబ్రాలు సమర్పించారు. అనంతరం గ్రామంలో ఉన్న కొంత మంది యువత ఆర్థిక సహకారంతో సుమారు 2500 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నృత్యాలతో గ్రామ సేవ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కల్యాణం సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. రెండో బహుమతి గెలుపొందిన కబడ్డీ టీ సభ్యులు గెలుచుకున్న మొత్తాన్ని స్వామి వారికి కానుకగా అలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపగాని శ్రవన్ కుమార్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



శతాబ్ది ఉత్సవాల్లో పాటలు పాడుతున్న గాయకులు

జిల్లా కేంద్రంలోని ఆర్య సమాజ్‌లో శతాబ్ది ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు 200 కుండలాలతో మహాయజ్ఞం నిర్వహించారు.

– రామగిరి(నల్లగొండ)



యజ్ఞకుండలిని తీసుకెళ్తున్న ఆర్యసమాజ్ ప్రతినిధులు

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ సునీత

వేములపల్లి : మండలంలోని రావువారిగూడెం, రావులపెంట, శెట్టిపాలెం, కామేపల్లి గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం ఎంపీపీ పుట్టల సునీత ప్రాంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అదేవిధంగా రావులపెంట గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించి జాబ్‌కార్డు ఉన్నవారు ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పల్లా వీరయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, బీరవెల్లి సతీష్‌రెడ్డి, మర్రి ఎలియాస్, పుట్టల శ్రీను, ఇరుగు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మాడుగులపల్లి : గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తుందని జెడ్పీటీసీ పుల్లెంల సైదులు అన్నారు. మండలంలోని చెరువుపల్లి గ్రామంలో రూ.10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలోనే పల్లెల సమగ్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వేముల గురవయ్య, మాజీ సర్పంచ్ సాయిలు, నాయకులు నాగిరెడ్డి, ఆరూరి నరేష్, మల్లారెడ్డి, సైదులు, ప్రవీణ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సందీప్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నాగరాజు



మిర్యాలగూడ టౌన్ : ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన నవ జీవన్ హైస్కూల్ కరస్పాండెంట్ రామకవచం నాగరాజు ఎంపికయ్యారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ ట్రస్మా బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి అన్ని విధాలుగా సహకరించిన ట్రస్మా జిల్లా అధ్యక్షులు ముక్కమాల రాంమోహన్, జిల్లా కార్యదర్శి గాదె రవీందర్‌రెడ్డిలతో పాటు రాష్ట్ర కమిటీలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రామకవచం నాగరాజు నియామకంపై ఆ సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కల్చరల్ సెక్రటరీ అహమ్మద్‌లతో పాటు పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ విద్యాలయం, ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం అకాడమిక్ మానిటరింగ్ అధికారి రమావత్ రామచంద్రయ్య, మండల నోడల్ ఆఫీసర్ మహమ్మద్ అబ్బాస్ అలీలు తనిఖీ చేశారు. అనంతరం ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం తరగతులు, విద్యార్థుల పఠన నైపుణ్యాలు, విద్యార్థుల గణిత శాస్త్ర ప్రావిణ్యతను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మిర్యాలగూడ : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ నూకల సరళహన్మంతరెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్న ఎంపీడీఓ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, ఆయాశాఖల అధికారులు సకాలంలో తమ ప్రగతి నివేదికలతో తప్పకహాజరు కావాలన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : గ్రామాల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మయ్యపాలెం పంచాయతీల్లో రూ.10లక్షతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరగానే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ పార్టీ కార్యకర్తలు సైనికులుగా పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ శంకర్ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణా నాయక్, నాయకులు మేరావత్ ముని నాయక్, లాలు నాయక్, నాగరాజు,శౌరి, హచ్చు, నాగేందర్, బిక్కు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

దళిత సంఘాల నిరసన

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి గుర్తింపును రద్దు చేయాలని దళిత సంఘా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆస్పత్రి యాజమాన్యం ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టి బెదిరింపులకు దిగుతుందని, వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మచ్చ ఏడుకొండలు, తలకొప్పుల సైదులు, ముండ్లగిరి కాంతయ్య, మల్లయ్య, లింగయ్య, రవిలు ఎంసీపీఐయూ రాష్ట్ర నాయకులు మట్టయ్య, అశోక్, అంజి, కాశి, సైదానాయక్, దైద రవి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రులపై జరుగుతున్న ఘటనలు దురదృష్టకరం

మిర్యాలగూడ అర్బన్ : ఇటీవల ప్రైవేట్ ఆస్పత్రులపై జరుగుతున్న ఘటనలు దురదృష్టకరమని ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు జీవనజ్యోతి, సరితలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోగిని చంపాలని ఏ వైద్యుడికి ఉండదని, ఒక్కో సమయంలో రోగి ఆరోగ్యస్థితిని బట్టి జరుగుతాయని, ఏదైనా సంఘటనలు జరిగిన సమయంలో ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి వైద్యుల వివరణ తీసుకోవాలని కోరారు. వైద్యుల వివరణలు తీసుకోకుండా తొందరపడితే వైద్యులపై తప్పుడు సంకేతాలు వెళ్తాయని పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీలకు ఇవ్వాలి



మాట్లాడుతున్న పగిడి జీడయ్యయాదవ్

మిర్యాలగూడ : మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని బీసీలకు ఇవ్వాలని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన దామరచర్ల మండల కేంద్రంలో మాట్లాడుతూ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి గత మూడు పర్యాయాలుగా ఒకసారి ఎస్టీకి, మరోసారి ఎస్సీకి రిజర్వ్ చేసిందని తెలిపారు. ప్రభుత్వం ఈసారి బీసీలకు రిజర్వ్ చేయాల్సిన స్థానాన్ని జనరల్‌కు మార్చడంపై బీసీలను రాజకీయంగా అణచివేసే కుట్ర దాగి ఉందన్నారు. మూడు పర్యాయాలు మూడు సామాజిక వర్గాలకు న్యాయం జరిగింది కాని బీసీలకు ఒక్కసారి కూడా అవకాశం రాలేదన్నారు. ఈసారైనా బీసీలకు కేటాయించాలని లేనట్లయితే బీసీ వర్గం కాంగ్రెస్‌కు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమరయ్య, డేరంగుల సత్యం, సయ్యద్ ఖాదర్, ఎస్‌కె.నాగులు, జానిమియా, పాల్గొన్నారు.

కొబ్బరికాయలు, లడ్డూ విక్రయాలకు వేలం



వేలంపాట నిర్వహిస్తున్న ఈఓ

అడవిదేవులపల్లి : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్థానిక శివాలయం వద్ద కొబ్బరికాయలు, లడ్డూ విక్రయాలకు వేలం పాటను ఈఓ మృత్యుంజయ శాస్త్రీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీలో నిర్వహించారు. కొబ్బరి కాయల వేలం పాటలో 50వేలు, లడ్డూ వేలంలో రూ.17వేలకు గ్రామానికి చెందిన చెన్నకేశవులు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రఘురామయ్యశర్మ, కృష్ణశర్మలతో పాటు స్థానికులు హనుమంతు, నాగేశ్వర్‌రావు, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తున్న కాంగ్రెస్

మిర్యాలగూడ టౌన్ : ఆరు గ్యారంటీ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేసి ఇచ్చిన మాటను కాంగ్రెస్ పార్టీ నిలనిలుపుకుంటుందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నూలన వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ దేశిడి శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని వినోభానగర్‌లో గృహా జ్యోతి పథకంలో భాగంగా జీరో విద్యుత్ బిల్లులను వారికి అందజేసి మాట్లాడారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కూడా తెలంగాణాలోని 17సీట్లు గెలిపించేందుకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు వెంకటేశ్వర్లు, అమర్‌సింగ్, లైన్‌మెన్ మురళీమోహన్ అసిస్టెంట్ లైన్‌మన్ రూపావత్ సైదానాయక్, లైన్ ఇన్స్‌పెక్టర్ మారం శ్రీనివాస్, వార్డు ఇంచార్జీ కొడిరెక్క ఇంద్రకుమార్, కోడిరెక్క శౌరీ, రెడ్యం నాగిరెడ్డి, తిరుపతిరెడ్డి, విద్యుత్ సిబ్బంది కిరణ్ తదితరులున్నారు.

అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు



శంకరయ్యను సన్మానిస్తున్న తహసీల్దార్ సరోజ

పెద్దవూర : ఉద్యోగులు విధుల్లో అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు వస్తుందని తహసీల్దార్ ఎస్. సరోజ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇరవై ఏళ్లుగా ఆఫీస్ సబార్డినేటర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన వెంకట్రాది శంకరయ్యకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం బంధువులు, స్నేహితులు, కార్యాలయ సిబ్బంది పలువురు శాలువాలు, పూలమాలతో సత్కరించి, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, ఆర్ఐలు దండ శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, శశిధర్, సీహెచ్ వెంకటేశ్వర్లు, బొడ్డు రమేష్, అటికం యాదగిరి, చెన్నయ్య, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదివి.. గురుకులంలో కొలువులు

మిర్యాలగూడ టౌన్ : ఓ వైపు కుటుంబ భారాన్ని మోస్తూనే.. మరో వైపు గురుకులం ఉద్యోగాలపై దృష్టి సారించారు. మిర్యాలగూడ పట్టణంలోని ఎస్ఎస్‌పీ క్యాంపులో గల మేరెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో పరీక్షలకు సన్నద్ధమయ్యారు. వీరిలో 10 మంది గురుకులం ఫలితాల్లో విజేతలుగా నిలిచారు. వరలక్ష్మి, శిరీష, జ్యోతి, సుజాత, మణెమ్మ, సుశీల(జెఎల్-తెలుగు), సరిత (జెఎల్-హిస్టరీ), రజియాసుల్తానా(జెఎల్ సివిల్), పరమేశ్వరీ(జెఎల్ - మ్యాథ్స్), సంతోష్(జెఎల్-ఇంగ్లిష్) ఉన్నారు.

పట్టుదలతో చదివి..



గుర్రంపోడు : గురుకుల డిగ్రీ, జూనియర్ లెక్చరర్‌ల ఫలితాల్లో గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామానికి చెందిన ఐతరాజు మమత కామర్స్ విభాగంలో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు పెళ్లైన తర్వాత చదువుపై ఆసక్తిని గమనించి తన భర్త లక్ష్మీనారాయణ ప్రోత్సాహించాడని తెలిపారు. నిర్దిష్టమైన ప్రణాళికతో చదివి ఈ ఉద్యోగం సాధించానని తెలిపారు.

ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిశీలన

రామగిరి(నల్లగొండ): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తిప్పర్తి తహసీల్దార్ డి.స్వప్న తెలిపారు. ఈ నెల 9 వరకు పెండింగ్ సమస్యలను పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు పేర్కొన్నారు. అపరిష్కృత దరఖాస్తుల వివరాలు కంప్యూటర్‌లో పొందుపరుస్తున్నామని అన్నారు. ఎసైన్డ్ భూములతో పాటు అన్ని రకాల వారసత్వ బదిలీ ప్రక్రియలు, జీపీఏ దరఖాస్తులు, భూ సమస్యలకు సంబంధించి వినతులు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ధరణి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని భూ సమస్యలు పరిష్కారం కాని వారు నేరుగా తహసీల్దా కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

హాలియా : అనుముల మండలంలోని యాచారం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రజాప్రతినిధులుగా, వివిధ శాఖల అధికారులుగా వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు కాంప్లెక్స్ హెచ్ఎం మహిపాల్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. యాదయ్య, ఉపాధ్యాయులు లలిత్ మోహన్, కె. నాగయ్య, కె. శ్రీను తదితరులు పాల్గొన్నారు.